నేతాజీ సేవలు మరువలేనివి

ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు

సంగారెడ్డి టౌన్: జిల్లా వ్యాప్తంగా స్వాతంత్య్ర సమర యోధుడు సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ సేవలు మరువలేనివని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అన్నారు. ఆయన పట్టణంలోని నేతాజీనగర్‌లోని సుభాస్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యకమంలో ఉపాధ్యక్షుడు సజ్జాద్ ఖాన్, మహేశ్‌కుమార్, పాండురంగ, సాయి తదితరులు పాల్గొన్నారు.

తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సంగారెడ్డి అర్బన్: తార ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ.. బ్రిటీష్ వారి నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలంటే శాంతి, అహింస మార్గాలు సరిపోవని నమ్మిన వ్యక్తి సుభాస్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వెంకటేశం ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు జగదీశ్వర్, అభిజిత్, పద్మజ, ఎన్‌సీసీ అధికారి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డి గ్రామంలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో నేతాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆనందేశ్వర్, సంఘం సభ్యులు గుండప్ప, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి అర్బన్: వేడుకలలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

జిన్నారంలో...

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన జిన్నారంలో ఎంపీటీసీ లావణ్య, వార్డు సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సుభాస్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆజాద్ హిందు ఫౌజ్‌ను స్థాపించి, దేశానికి రక్షణ సైన్యాన్ని ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి నేతాజీ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, నాయకులు నరేందర్, పల్నాటి భాస్కర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జీడిగడ్డ తండాకు పాత పంటల జాతర

జహీరాబాద్ టౌన్: డీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పంటల జాతర మండలంలోని జీడిగడ్డ తండాకు చేరుకుంది. మంగళవారం తండాకు జాతర బండ్లు రావడంతో గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఎడ్ల బండ్లకు పూజలుచేసి తండాలో ఊరేగించారు. ఈ సందర్భంగా గిరిజనులు సాంప్రదాయ నృతాలుచేసి సందడి చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ 23 ఏళ్ల నుంచి ఈ జాతరను నిర్వహిస్తూ ప్రజల్లో పాత పంటలపై చైతన్యం తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు ప్రభుత్వాలు కూడా పాత పంటలను గుర్తిస్తున్నాయని చెప్పారు. కుటుంబానికి సరిపడా పంటలను పండించుకోవాలని రైతులను కోరారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని, పశువుల మేత కూడా లభిస్తుందని సూచించారు. పాత పంటలను పండించే రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, డీడీఎస్ సిబ్బంది చంద్రమ్మ లక్ష్మమ్మ, పూలమ్మ, చుక్కమ్మ, చిన్న నర్సమ్మ, మంజుల, వినయ్, బాలయ్య పాల్గొన్నారు. పాత పంటల జాతర చూసేందుకు నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఉదయ్ కిరణ్, పవన్, రుక్మిణీ దేవి, సీఎస్‌ఏ ప్రతినిధులు వచ్చారు.



జాతర బండ్లకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

క్లుప్తంగా

ఉర్దూ విద్యార్థులకు గైడ్స్ పంపిణీ



గైడ్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్

సదాశివపేట(సంగారెడ్డి): కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. ఏఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎంపీ అసదొద్దీన్ ఒవైసీ సూచనల మేరకు మంగళవారం పట్టణ అధ్యక్షుడు గౌస్‌పాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అక్తార్, కుద్దుస్, నిజామొద్దిన్, రియాజోద్దిన్, అన్వర్‌పటేల్, యాకుబ్, అప్రోజ్, సలావుద్దిన్, మోహి జ్, హుస్సేన్, ఖలీల్, నసిరొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మెట్టు కుమార్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నర్రబస్తీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌తో పాటు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీని అభివృద్ధి చేస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి చెప్పారు. మంగళవారం వారు వార్డు కౌన్సిలర్ సతీశ్‌తో కలసి కాలనీలో పర్యటించి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజారెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఏఈ శ్రీకాంత్, ప్రశాంత్, వినోద్, వీరారెడ్డి, రఘు, కాలనీవాసులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి మంగళవారం తన ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు అశ్విన్ పాటిల్, అక్షయ్ జాడె జ్వల్‌రెడ్డిపై రూపొందిన పాటల సీడీని ఆవిష్కరించారు. పాటలు రాసి, సీడీని రూపొందించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో తాహెర్ పటేల్, జగదీశ్వర్‌రెడ్డి, నతానియల్, జుబేర్ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

కంది(సంగారెడ్డి): బాలుడు అదృశ్యమైన ఘటన కంది మండల పరిధిలోని కలివేములలో చోటు చేసుకుంది. మునిపల్లి మండలం మల్లారెడ్డిపేటకు చెందిన ప్యాట ప్రశాంతి కుమారుడు గణేశ్ జోగిపేటలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం 9గంటలకు పతంగి తీసుకొని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ప్రశాంతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలుడి సమాచారం తెలిసిన వారు 87126 56719, 87126 56747 నంబర్లకు తెలియజేయాలని ఎస్‌ఐ తెలిపారు.



గణేశ్(ఫైల్)

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చదువుతోపాటు విద్యార్థులు, యువతకు క్రీడలూ ముఖ్యమేనని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. పక్షం రోజులుగా ఎస్‌కేఎస్ అండ్ పీఎస్ఆర్ గోల్డెన్ క్రికెట్‌టోర్నీ మంగళవారం ముగిసింది. రాయల్ వారియర్స్ టీం విన్నర్‌గాను, నేచురల్‌స్టార్ టీం రన్నర్‌గాను నిలిచింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆయా టీంలతో పాటు బెస్ట్‌బౌలర్, బెస్ట్ కీపర్‌లకు కప్పులు, పతకాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. కౌన్సిలర్లు దారం శంకర్, వివేకానంద్, సద్దాం, మాజీ ఎంపీపీ జీవులానాయక్, చందర్‌నాయక్, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డికి బస్సు నడపండి..

నారాయణఖేడ్ నుంచి కల్హేర్, మాసాన్‌పల్లి, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌ల మీదుగా ఎల్లారెడ్డి వరకు, ఖేడ్ నుంచి హన్మంత్‌రావుపేట్, మాద్వార్, లింగనాయక్‌పల్లి మీదుగా గునుకులకుంటకు బస్సులు నడపాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆర్టీసీ డీఎం మల్లేశయ్యకు సూచించారు. మంగళవారం డీఎంతో పాటు పీఆర్వో పాండు మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని సూచించగా త్వరలో నడుపుతామని డీఎం హామీ ఇచ్చారు. నూతనంగా కొన్ని బస్సులను ఏర్పాటు చేయాలని డీఎం కోరగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



విన్నర్ జట్టుకు కప్పు అందజేస్తున్న సంజీవరెడ్డి, సురేశ్ షెట్కార్

క్రీడాకారిణికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్ లీగ్‌లో కత్తి సాము విభాగంలో బంగారు పతకం సాధించిన శ్రీవల్లిని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తన డివిజన్లోని మాక్స్ సొసైటీ కాలనీకి చెందిన క్రీడాకారిణి శ్రీవల్లి బంగారు పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవల్లిని సన్మానిస్తున్న కార్పొరేటర్ సింధు

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి

జోగిపేట(అందోల్): 17వ వార్డు కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు రూపొందించిన క్యాలెండర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం ఆవిష్కరించారు. రేజింతల్ వినాయకుడి ఫొటోతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగ సురేశ్, సురేందర్‌గౌడ్, డి.శివశంకర్, ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ డీజే వెంకటేశం, నాయకులు డి.శ్రీనివాస్, బంజ రవి, అరిగె రాములు ముదిరాజ్ అంబేడ్కర్ సంఘం నాయకుడు తుడుం యాదయ్య పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర

దుర్గేశ్వరరెడ్డికి ఎమ్మెల్యే సన్మానం

హత్నూర (సంగారెడ్డి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లారెడ్డిగారి దుర్గేశ్వరరెడ్డిని ఎమ్మెల్యే సునీతారెడ్డి సన్మానించారు. ఆయన మంగళవారం ఎమ్మెల్యేను ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ప్రైవేట్ కళాశాలల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల వైస్ ప్రెసిడెంట్ పొట్ల చెరువు నరేందర్, మోత్కు మధుసూదన్ గౌడ్, జి.వెంకటేశ్‌గౌడ్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



దుర్గేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న సునీతారెడ్డి

గీతం విద్యార్థినికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు: గీతం విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని పుష్ప డాక్టరేట్ అందుకున్నారు. పారిశ్రామికవేత్తల విజయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ఆమె చేసిన ప్రత్యేక అధ్యయనంపై ఈ డాక్టరేట్ వచ్చిందని గైడ్స్‌గా వ్యవహరించిన డాక్టర్ నాగప్రియ, ప్రొఫెసర్ లక్ష్మణ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆమెను అదనపు ప్రొఫెసర్ డీఏస్‌రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు అభినందించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పదో తరగతి విద్యార్థులు తమ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి దండు అంజయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని వెల్టూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం సాధించవచ్చన్నారు. ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ, సీఆర్పీలు రాజేశ్వర్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ టీపీటీఎఫ్ 2024 డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. మంగళవారం ఖేడ్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, విజయేందర్‌రెడ్డి, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్: అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ సురేఖకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధి బీరంగూడలోని గౌతమ్ మోడల్ స్కూల్, ఇస్నాపూర్‌లో మా ప్లే ఇంటర్నేషనల్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. గౌతం మోడల్ స్కూల్ గత సంవత్సరంలో ప్రారంభమైందని, దానికి ఏడో తరగతి వరకే అనుమతి ఉండగా 8, 9 తరగతులకు అడ్మిషన్ తీసుకొని రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఇస్నాపూర్‌లోని మా ప్లే ఇంటర్నేషనల్ స్కూల్‌ది కూడా అదే పరిస్థితి అని వాపోయారు. ఏడో తరగతి వరకే పర్మిషన్ ఉండగా యజమాన్యం తప్పుడు ప్రచారం చేస్తూ 8, 9, పదో తరగతికి అడ్మిషన్‌లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రూ.58 వేల నుంచి రూ.65 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఆ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, నాయకులు పున్లిక్, కార్తీక్ ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గురుకుల విద్యార్థులకు వ్యాక్సినేషన్

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల విద్యార్థులకు మొగుడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, మల్లమ్మ, ఏఎన్ఎం సుమలత, ఆశా వర్కర్స్ టెటానస్, డిప్తీరియా వ్యాక్సినేషన్ వేశారు. ధనుర్వాతం, కంఠసర్పి వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్స్ కేఏస్ జమీల్, జె.రాములు స్టాఫ్ నర్స్ సోలమన్ రాజ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వ్యాక్సిన్ ఇస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్న

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని న్యాల్‌కల్ జెడ్పీటీసీ సభ్యురాలు స్వప్న చెప్పారు. మంగళవారం స్థానిక బీసీ కాలనీలో రూ.5 లక్షలు జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కాలనీ వాసుల కోరిక మేరకు సీసీ రోడ్డును మంజూరు చేయించామని, అన్ని గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకరయ్యస్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, నాగన్న, బస్వరాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

నారాయణఖేడ్: మండల పరిధిలోని నాగాపూర్ తండాకు చెందిన రైతు రామ్‌నాయక్‌కు సంబంధించిన పాడిగేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. తండా శివారులో మేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.90 వేల వరకు ఉంటుందని, తమ జీవనాధారం కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **అంబేద్కర్ చిత్ర పటాల పంపిణీ**

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని వడ్డి గ్రామంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు ఆనందేశ్వర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, తపాలా శాఖకు కార్యాలయంలో చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

◆ **జిల్లాలో బీజేపీ బలోపేతం**

నారాయణఖేడ్: బీజేపీ నూతన జిల్లా అధ్యక్షురాలు గోదావరి నేతృత్వంలో జిల్లాలో పార్టీ బలపడడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం గోదావరి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆమెను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా నాయకురాలిని జిల్లా అధ్యక్షురాలిని చేసిన ఘనత బీజేపీదేనని, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు.

◆ **రోడ్లకు మరమ్మతులు**

మునిపల్లి(అందోల్): మండలంలో రహదారులకు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం కంకోల్ నుంచి తాటిపల్లి మీదుగా కప్పాడ్ వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. వారం రోజులుగా కంకోల్ నుంచి అంతారం వరకు రోడ్డు పనులు చేయిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కంకోల్ నుంచి తాటిపల్లి మీదుగా కప్పాడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

◆ **రేపు భవానీ మందిరంలో యజ్ఞం**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హోతి(కె) శివారులో గల భవానీ మాత మందిరం వద్ద గురువారం యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ప్రధాన పూజారి తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించనున్న ఈ యజ్ఞం ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు కొనసాగుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ **అభయాంజనేయుడికి పూజలు**

మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తా సమీపంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో అంజనేయుడికి మంగళవారం అర్చకుడు అయ్యప్పస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **బార్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ**

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన టేబుల్ క్యాలెండర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు మంగళవారం కోర్టులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

◆ **63 మందికి వైద్య పరీక్షలు**

కోహీర్(జహీరాబాద్): కోహీర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. శస్త్ర చికిత్సల నిమిత్తం 27 మందిని రిఫర్ చేశారు. హైదరాబాద్ మెడివిజన్ ఆస్పత్రి వైద్యులు దీపక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించడంతో పాటు రవాణా, మందులు, భోజన ఖర్చులను తామే భరిస్తామని సంఘం అధ్యక్షుడు రత్నయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దశరత్‌రెడ్డి, బస్వరాజ్, బసప్ప, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **చేసినసేవలే గుర్తుంటాయి**

మనూరు(నారాయణఖేడ్): ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు చేసిన సేవలే గుర్తుంటాయని నాయబ్ తహసీల్దార్ శివరామకృష్ణ అన్నారు. మంగళవారం నాగల్‌గిద్ద ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ ఇటీవలే సంగారెడ్డి ఏరియాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఖేడ్ డివిజన్ ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేశ్, చంద్రశేఖర్, రవీందర్‌రావు, కరస్‌గుత్తి సర్పంచ్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

కోహీర్(జహీరాబాద్): కోహీర్‌లోని శ్రీరామ మందిరంలో సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మహిళలు దీపోత్సవం నిర్వహించారు. అనంతరం కరసేవకులను సత్కరించారు.

◆ **పైపులను పగులగొట్టిన వ్యక్తిపై కేసు**

సంగారెడ్డి: గ్రామానికి నీటి సరఫరాచేసే పైపులను పగులగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఇంద్రకరణ్ ఎస్‌ఐ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎద్దు మైలారంలో నీటి సరఫరాకు వినియోగిస్తున్న పైపులను అదే గ్రామానికి చెందిన దేవునూరి జయకృష్ణ పగులగొట్టడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పంచాయతీ కార్యదర్శి పద్మదాసుల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు జయకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

◆ **పథకాలను వినియోగించుకోవాలి**

సంగారెడ్డి టౌన్: మాజీ సైనికులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి సత్య శ్రీ సూచించారు. మంగళవారం జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో మాజీ సైనికుల ముఖాముఖి సమావేశం నిర్వహించారు. పథకాలను ఆన్ లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

◆ **మట్కా నిర్వాహకుడి అరెస్టు**

జహీరాబాద్ టౌన్: మట్కా నిర్వాహకుడిని మంగళవారం రాత్రి అరెస్టు చేశామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టణానికి చెందిన ఎండీ రఫీ, శాంతినగర్‌కు చెందిన ఎండీ సమీయోద్దీన్‌లు సెల్‌ఫోన్ ద్వారా మట్కా జూదం నిర్వహిస్తుండటంతో వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.1.20 లక్షల నగదు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.